సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



ఆరు ఎకరాల భూమికి పట్టా

తమ భూమిని తమకు తెలియకుండానే ఇతరులకు పట్టా చేయడంపై అసలు పట్టాదారులు ఆందోళనకు దిగారు. 8లో▸



హామీలు నెరవేర్చాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



వ్యసనాలకు దూరంగా..

యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను చిత్తు చేసుకోవద్దని షాద్‌నగర్ పట్టణ సీఐ విజయకుమార్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి




ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌ఓ సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ వారం 52 ఫిర్యాదులు అందినట్టు తెలిపారు.

ఆదిబట్ల పోలీసుల పనితీరు భేష్

కితాబిచ్చిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం రూరల్: కేసుల ఛేదనలో ఆదిబట్ల పోలీసులు పాత్ర బాగుందని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు కితాబిచ్చారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. ఓ వ్యాపారిని కిడ్నాప్ చేసి తుపాకీ పెట్టి డబ్బులు డిమాండ్ చేసిన కేసును సూడో పోలీసులు రెండు రోజుల్లో ఛేదించడం అభినందనీయమన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కడియాసాన్‌సీ గ్యాంగ్‌ను పట్టుకోవడం సాహసోపేతమైనదన్నారు. ప్రాణాలకు తెగించి దోపిడీ దొంగలను పట్టుకొని వారి నుంచి భారీ ఎత్తున బంగారం స్వాధీనం చేసుకొని బాధితులకు న్యాయం చేయడంలో ఆదిబట్ల పోలీసులు చూపిన తెగువ ఎనలేదనిదన్నారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి టీం కృషిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటేశ్, రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్య బిర్లా గ్రూప్ పుష్పశ్రీ ఫ్యాక్టరీ ప్రారంభం



మాట్లాడుతున్న ఆదిత్య బిర్లా గ్రూప్ వైస్ చైర్‌పర్సన్ రాజశ్రీ, చిత్రంలో రాచకొండ సీపీ

ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోబానగర్ వైట్‌గోల్డ్‌లో పుష్పశ్రీ ఫ్యాక్టరీని ఆదిత్య బిర్లా గ్రూప్ వైస్ చైర్‌పర్సన్ రాజశ్రీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబుతో ఆమె పలు అంశాలపై ముచ్చటించారు. రాచకొండ కమిషనరేట్ భౌగోళిక పరిస్థితులు, నేర నియంత్రణ విధానాలు, షీ టీమ్స్ పనితీరు, సీసీ కెమెరాలు, టీవీల నిర్వహణ వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఆదిత్య బిర్లా గ్రూప్ తరఫున రాచకొండ కమిషనరేట్ పరిధిలో సీసీటీవీల నిర్వహణ, ఇతర అవసరాలకు నిధులు, సాంకేతిక తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అపొ్పా డైరెక్టర్ అభిలాష బిస్త్, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టికి తేవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 99592 26287 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

88 నూతన సబ్‌స్టేషన్లు



డిమాండ్‌కు తగ్గట్లు డిస్కం ప్రణాళికలు

- అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా
- 2026 నాటికి అందుబాటులోకి కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లు
- రంగారెడ్డిజోన్‌లో 34, మెట్రోలో 36, మేడ్చల్ జోన్‌లో 18
- త్వరలో ఖరారు కానున్న టెండర్లు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: పెరుగుతున్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు దీటుగా విద్యుత్ సరఫరా వ్యవస్థను విస్తరించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ యాక్షన్‌ప్లాన్ తయారు చేసింది. రాబోయే పదేళ్ల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఇప్పటి నుంచే ఆ దిశగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తోడు గ్రేటర్ వాసుల భవిష్యత్తు అవసరాలను తీర్చేందుకు కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే రోజువారీ సగటు డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించింది. ప్రస్తుతం డిస్కం పరిధిలో మొత్తం 164 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించాలని నిర్ణయించగా, వీటిలో గ్రేటర్ జిల్లాల పరిధిలోనే రూ.420 కోట్ల అంచనాతో 88 సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. బంజారాహిల్స్ సర్కిల్లో ఐదు, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లో తొమ్మిది, హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో తొమ్మిది, సికింద్రాబాద్ సర్కిల్‌లో 13, రాజేంద్రనగర్ సర్కిల్‌లో 13 చొప్పున, సైబర్‌సిటీ సర్కిల్‌లో ఆరు, సరూర్‌నగర్ సర్కిల్‌లో 5, వికారాబాద్‌లో పది, మేడ్చల్‌లో 18 చొప్పున కొత్త సబ్‌స్టేషన్లు అందుబాటులోకి తేనుంది. వీటికి అవసరమైన భూమిని కూడా ఎంపిక చేసి, గ్లోబల్ టెండర్లు పిలిచింది. త్వరలోనే టెండర్లు ఖరారు చేయనున్నారు. ఒక్కో సబ్‌స్టేషన్‌లో 12.5 ఎంవీఏ సామర్థ్యంతో కూడిన పీటీఆర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. 2026 వేసవి నాటికి ఈ కొత్త సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

మెట్రోజోన్‌లో..

బంజారాహిల్స్ సర్కిల్‌లో రోడ్‌నంబర్ 10లోని జహీరానగర్, జూబ్లీహిల్స్, మాదాపూర్ టీజీఐఐసీ, ఛాతి ఆస్పత్రి, ఆల్విన్‌కాలనీ సహా హైదరాబాద్ సెంట్రల్ పరిధిలో ఫ్రైడ్ ఇండియా కాలనీ, శాతంతలాబ్, మిర్జాకాలనీ, ఎర్రమంజిల్ ఐసీ క్వార్టర్స్, మెహిదీపట్నం బస్‌డిపో, ముషీరాబాద్ బస్‌డిపో, చాచా నెహ్రూపార్క్, కింగ్‌కోఠి ఆస్పత్రితో పాటు హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధిలో అత్తాపూర్ ఎస్టీపీ, పూల్‌బాగ్, ఫరూఖ్‌నగర్, నిజామియా యునానీ ఆస్పత్రి, సుల్తాన్‌షాహి, శాలివాహననగర్, దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డిపో, సోమనాథనగర్ జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్, శ్రీ వెంకటేశ్వర ఎన్‌క్లేవ్‌ల్లో కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. సికింద్రాబాద్ సర్కిల్‌లో భవానీనగర్, తుకారాంగేట్, హస్మత్‌పేట్, రసూల్‌పుర, గాంధీమెడికల్ కాలేజీ, అల్వాల్ హిల్స్ మంగాపురం, జ్యోతినగర్, బాలానగర్ సీఐఈ, ఐడీఏ కూకట్‌పల్లి, జేబీఎస్ బస్‌డిపో, రాణిగంజ్ బస్‌డిపో, ఖాంజీగూడ, అల్వాల్‌హిల్స్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు.

మేడ్చల్ జోన్‌లో..

హబ్సిగూడ సర్కిల్ పరిధిలో వెంకటాపూర్, మేడిపల్లి సహా మేడ్చల్ సర్కిల్ పరిధిలో శంభీపూర్, సాయినగర్, అంతాయిపల్లి ఐడీఓసీ, షాపూర్‌నగర్‌లలో కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. సంగారెడ్డి సర్కిల్ పరిధిలోని పోచారం, లక్డారం, పెద్దాపూర్, సదాశివపేట, సింఫనీ పార్క్‌కాలనీ, అందోల్, రాజంపేట్, ఆరుట్ల, జహీరాబాద్ రైల్వేస్టేషన్, గోపనపల్లి, గుడిపల్లి, తిమ్మాపూర్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి.

రంగారెడ్డిజోన్‌లో..

సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలోని మోకిల (అపర్ణ కొండకల్), నెక్నంపూర్, బొటానికల్ గార్డెన్, నల్లగండ్ల హుడా, హఫీజ్‌పేట్, 8వ బెటాలియన్ సహా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గాస్‌నగర్, కింగ్స్‌కాలనీ, నూరినగర్, మీరాలంపార్క్, బైరాగిగూడ, హుడాహెచ్ఎస్‌బీ, సాతంరాయి, పీఅండ్‌టీ కాలనీ (హిమాయత్‌సాగర్), ఓమన్‌నగర్(కిస్మత్‌పూర్), లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ, రాజేంద్రనగర్ ఆర్డీఓ ఆఫీసు, అమ్మపల్లి, గుంజల్‌పహాడ్ వద్ద కొత్తగా 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని మన్సూరాబాద్ పెద్దచెరువు, బీఎన్‌రెడ్డినగర్ హెచ్ఎండబ్ల్యూఎస్ సాహెబ్‌నగర్, బడంగ్‌పేట్ డంపింగ్‌యార్డ్, బండ్లగూడ ఎస్టీపీప్లాంట్, కుంట్లూరు మదర్‌డెయిరీ వద్ద కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇక వికారాబాద్ సర్కిల్‌లో క్యాసారం, న్యూ కలెక్టరేట్ ఆఫీసు, గోధుంగూడ, లగచర్ల, హుస్నాబాద్, కిష్టాపూర్, కుసుమసముద్రం, నారాయణపూర్, పట్లూర్‌లోనూ అందుబాటులోకి రానున్నాయి.



ఇర్విన్ గ్రామ సమీపంలో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం
- ప్రయాణికులంతా సురక్షితం

మాడ్గుల: మండలంలోని ఇర్విన్ గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ప్రయాణికుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం నుంచి సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు మాల్ బ్రాహ్మణపల్లి మీదుగా ఇర్విన్‌కు వస్తోంది. బస్సు ఫిట్‌నెస్ లేకపోవడం.. మితిమీరిన వేగంతో ఉండటంతో బ్రేక్ పడక ఇర్విన్ గ్రామ సమీపంలో పొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో రోడ్డు పక్కన పొలాల్లో నిలిచిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 80 మంది ప్రయాణికులు ఉన్నారు. ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలు కాగా మిగతావారంతా సురక్షితంగా ఉన్నారు.

మహిళా యూనివర్సిటీలో కుక్కల దాడి

ఇద్దరు విద్యార్థినులకు తీవ్ర గాయాలు





సుల్తాన్‌బజార్: కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయింది. యూనివర్సిటీ ప్రాంగణంలో దాదాపు 20 కుక్కలు రోజూ స్వైర విహారం చేస్తుంటాయి. ఆదివారం రాత్రి కళాశాల హాస్టల్ వైపు వెళ్తున్న డిగ్రీ విద్యార్థినులు అంకిత, ప్రవీణపై కుక్కలు ఒక్కసారిగా దాడిచేసి కరిచాయి. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కుక్కలు దాడి చేయడంతో పరిగెత్తిన ఓ విద్యార్థిని చెవికమ్మ తెగిపోయి తీవ్ర రక్తస్రావమైంది. మరో విద్యార్థినికి ముఖంపై గాయాలు కావడంతో యూనివర్సిటీ నిర్వాహకులు వారిని బర్కత్‌పురాలోని సీసీ షరాఫ్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల అధికారులపై మండిపడ్డారు. యూనివర్సిటీలో కుక్కలతో పాటు పాములు సైతం పెద్ద సంఖ్యలో తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వర్సిటీ వీసీ సూర్య ధనుంజయ్ మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టిన రెండవ రోజే వర్సిటీలో కుక్కల నియంత్రణపై జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడిన విద్యార్థిని

- విరిగిన రెండు కాళ్లు, వెన్నెముక
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పూజ

షాద్‌నగర్‌రూరల్: ప్రమాదవశాత్తు ఓ విద్యార్థిని భవనంపై నుంచి పడిపోయింది.. రెండు కాళ్లు, వెన్నెముక విరిగిపోవడంతో ఆస్పత్రికి తరలించారు.. వసతి గృహం నిర్వాహకులు విషయాన్ని బయటకు పొక్కనీయకపోవడంతో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. జిల్లేడ్ చౌదరిగూడ మండలం ముష్టిపల్లి తండాకు చెందిన బుజ్జిబాయి, బాబ్యా దంపతుల కూతురు పూజ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూ హాజిపల్లి రోడ్డు సమీపంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతిగృహంలో ఉంటోంది. ఈ నెల 6న (శుక్రవారం) రాత్రి 11.30 గంటల సమయంలో వసతిగృహం రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి పడిపోయింది. ఈ ప్రమాదంలో పూజ రెండు కాళ్లు, వెన్నెముక విరిగిపోయాయి. ప్రమాద విషయాన్ని హాస్టల్ నిర్వాహకులు విద్యార్థిని తల్లిదండ్రులకు తెలపడంతో వారు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థినిని పరీక్షించిన వైద్యులు ఆమె రెండు కాళ్లు, వెన్నెముక విరిగిపోయినట్లు నిర్ధారించారు. ఆపరేషన్ చేసేందుకు దాదాపు రూ.8 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. పేదరికంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న తల్లిదండ్రులు అంత ఖర్చు భరించలేక ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా, పూజకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని ఏఐఎస్ఎఫ్ తాలుకా ఇన్‌చార్జి ఆకాష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శించారు.

లోక్‌అదాలత్‌తో సత్వర పరిష్కారం

రిటైర్డ్ జడ్జి సాంబశివుడు



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డ్ జడ్జి సాంబశివుడు, పక్కన ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

చేవెళ్ల: ట్రాఫిక్ పోలీస్ కేసులకు సంబంధించి పెండింగ్ కేసులను పరిష్కరించేందుకే ప్రత్యేకంగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ జడ్జి సాంబశివుడు, రాజేంద్రనగర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ ఎ.బాలాజీ అన్నారు. మండలకేంద్రంలోని కోర్టు ఆవరణలో సోమవారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో సాంబశివుడు మాట్లాడారు. లోక్ అదాలత్‌లతో పెండింగ్ కేసులు సత్వరం పరిష్కారం చేసుకోవచ్చని సూచించారు. మొదటిరోజు మద్యం తాగి వాహనాలు నడిపించిన 66 కేసులు పరిష్కారం అయినట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీ వరకు ఆరు రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన ట్రాఫిక్ పోలీసు కేసులకు సంబంధించి పరిష్కరించుకోవచ్చన్నారు. ట్రాఫిక్ డీసీపీ బాలాజీ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపించే ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడిపించకూడదని సూచించారు. వీటితో కలిగే నష్టాలను వివరించారు. ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలన్నారు. ఇప్పటికే నమోదైన ట్రాఫిక్ కేసులు పెండింగ్‌లో ఉంటే వాటిని పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ష్..ఇప్పుడొద్దులే..!

- హెచ్ఎండీఏలో భూముల వేలం డీలా
- పలుచోట్ల మిగిలిన ప్లాట్ల వేలానికి సన్నాహాలు
- పదిరోజుల క్రితం వరకు హడావుడి
- రియల్ స్తబ్దతతో వెనుకంజ

hmda Growing Global

సాక్షి సిటీబ్యూరో: ఆన్‌లైన్ బిడ్డింగ్ అన్నారు.. హడావిడి చేశారు. లే అవుట్‌లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్థలాల జాబితాను సైతం సిద్ధం చేశారు. అంతలోనే వెనుకడుగు వేశారు. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)లో నెలకొన్న పరిణామం ఇది. గతేడాది భూముల అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం లభించింది. అదే సమయంలో కొందరు వేలంలో పాల్గొన్నప్పటికీ డబ్బులు చెల్లించకుండా చేతులెత్తేశారు. హెచ్ఎండీఏలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న లే అవుట్‌లలో కనీసం 50 శాతం వరకు ఎగవేతదార్లు ఉన్నట్లు సమాచారం. డబ్బులు చెల్లించకపోవడం వల్ల నిలిచిపోయిన స్థలాలతో పాటు, వివిధ లే అవుట్‌లలో మిగిలిపోయిన స్థలాలకు సైతం బిడ్డింగ్ నిర్వహించాలని అధికారులు భావించారు. రియల్ స్తబ్దత కారణంగా ముందడుగు వేయలేకపోయారు. ఆన్‌లైన్ బిడ్డింగ్ ప్రతిపాదనలను ప్రస్తుతానికి విరమించుకున్నట్లు తెలిసింది. కోకాపేట్, మోకిల, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు గతంలో అనూహ్య స్పందన లభించిన సంగతి తెలిసిందే. అప్పట్లో స్థలాలు, ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిన బిల్డర్లు, రియల్టర్లలో కొందరు పూర్తిగా డబ్బులు చెల్లించి భూములను సొంతం చేసుకున్నారు. మరి కొంతమంది ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో పాల్గొని స్థలాలను దక్కించుకున్నప్పటికీ ఇప్పటికీ డబ్బులు చెల్లించకపోవడం గమనార్హం. అలాంటి వాటిని గుర్తించి మొదట విక్రయించేందుకు హెచ్ఎండీఏ అధికారులు రంగం సిద్ధం చేశారు. గతంలో విక్రయించిన ధర కంటే తక్కువకు అమ్ముడైతే పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి వస్తుందని ప్రస్తుతానికి వాయిదా వేసినట్లు ఓ అధికారి తెలిపారు.

అప్పుడు అది హాట్ కేక్ సరే..

ఉప్పల్ భగాయత్, హయత్‌నగర్, బాచుపల్లి, బోడుప్పల్, మేడిపల్లి, హెచ్ఎంటీ కాలనీ, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాలతో పాటు నగరానికి పడమటి వైపున కోకాపేట్‌లో పెద్ద ఎత్తున భూములు ఉన్నాయి. గత సంవత్సరం కోకాపేట్‌లో రెండు దఫాలుగా వేలం నిర్వహించారు. స్థలాలు హాట్‌కేక్‌ల్లా అమ్ముడయ్యాయి. ఒకవైపు ఔటర్‌రింగ్‌రోడ్డు, మరోవైపు ఎయిర్‌పోర్టు అందుబాటులో ఉండడంతో అనేక సంస్థలు కోకాపేట్‌పై ఆసక్తి చూపుతున్నాయి. ఈ ట్రెండ్‌ను దృష్టిలో ఉంచుకొని మొదట కోకాపేట్‌లో మిగిలిన స్థలాలకు బిడ్డింగ్ నిర్వహించాలని భావించారు. ఇప్పుడు అదేస్థాయి డిమాండ్ ఉండకపోవచ్చనే అంచనాలతో వాయిదా వేసుకున్నారు.

మరి కొంతకాలం వేచి చూడాల్సిందే..

హెచ్ఎండీఏకు ఉన్న సొంత భూములతో పాటు వివిధ ప్రాంతాల్లో రైతుల నుంచి సేకరించి లే అవుట్‌లను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. కుర్మల్‌గూడ, ప్రతాప్‌సింగారం, దండుమల్కాపురం, లేమూరు, ఇన్ముల్‌నర్వ, కొర్రెముల, నాదర్‌గుల్ తదితర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న భూములను గుర్తించారు. ఇన్ముల్‌నర్వలో 96 ఎకరాలు, లేమూరులో మరో 83 ఎకరాల్లో రోడ్లు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టారు. మిగతా చోట్ల కుర్మల్‌గూడలో 92 ఎకరాలు, బోగారంలో 125, ప్రతాప్‌సింగారంలో సుమారు 153 ఎకరాలు, దండుమల్కాపురంలో మరో 355 ఎకరాల చొప్పున భూమి ఉన్నట్లు గుర్తించారు. కానీ కొన్ని చోట్ల హెచ్ఎండీఏకు భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రాలేదు. మరికొన్ని చోట్ల సాంకేతిక కారణాల వల్ల జాప్యం చోటుచేసుకుంది. రియల్ రంగంలో నెలకొన్న ప్రస్తుతం అనిశ్చితిని దృష్టిలో ఉంచుకొని భూముల సేకరణ, లేఅవుట్ల అభివృద్ధి, ఆన్‌లైన్ బిడ్డింగ్‌పైన మరి కొంతకాలం వేచి చూసే ధోరణే మంచిదని భావిస్తున్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



నషాముక్త భారత్ కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ సీఐ విజయ్‌కుమార్ తదితరులు

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం
- పట్టణ సీఐ విజయ్ కుమార్

షాద్‌నగర్‌రూరల్: యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను చిత్తు చేసుకోవద్దని పట్టణ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బుగ్గా రెడ్డి గార్డెన్‌లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 'నషాముక్త భారత్–ప్లాస్టిక్ రహిత సమాజం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని.. సన్మార్గంలో నడిస్తే భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందన్నారు. అనంతరం ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన ఉండాలన్నారు. అనంతరం ఎస్ఐ సుశీల మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తుందన్నారు. ప్రభుత్వాలు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ క్షేత్రసేవా ప్రముఖ్ బండారి రమేష్, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సేవా ప్రముఖ్ శివశంకర్, ఆర్ఎస్ఎస్ కమలాకర్, బజరంగ్‌దళ్ విభాగ్ సంయోజక్ గూడెం రమేష్, జిల్లా సురక్ష ప్రముఖ్ ప్యాట వంశీ, వీహెచ్‌పీ నాయకులు బాలబ్రహ్మ చారి, ఆకుల మల్లికార్జునప్ప, సందీప్‌కుమార్, మఠం రుషికేష్, బజరంగ్‌దళ్ నాయకులు గిరి, భాను, దిలీప్, సురేష్, పవన్, చరణ్, విజేత, విశ్వభారతి, విజ్ఞాన్ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చామంతి పూలసాగుపై నేడు రైతులకు శిక్షణ

చేవెళ్ల డివిజన్ ఉద్యాన అధికారి కీర్తి

చేవెళ్ల: చామంతి పూలసాగు చేపట్టే రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో మంగళవారం శిక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల ఉద్యానశాఖ అధికారి కీర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీ వద్ద ఉదయం గంటల నుంచి చామంతి పూల సాగుపై మహిళా రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. వివరాలకు 8977714222 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలులో బిహార్‌వాసి మృతి

సికింద్రాబాద్: కృష్ణా ఎక్స్‌ప్రెస్‌రైలులో బిహార్ వాసి మృతి చెందిన ఘటన సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు..సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 8వ నెంబర్ ప్లాట్‌ఫామ్ పైకి చేరుకున్న కృష్ణాఎక్స్‌ప్రెస్ రైలులో వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు రైల్వేపోలీసులకు ప్రయాణికులు సమాచారం అందించారు. పోలీసులు అంబులెన్స్‌ను రప్పించినప్పటికీ అప్పటికే అతను మృతిచెంది ఉండడాన్ని గుర్తించారు. ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు బిహార్ రాష్ట్రం నలందా జిల్లాకు చెందిన ఉమేశ కుమార్‌గా గుర్తించారు. ఉమేశ్‌కుమార్ అనారోగ్యంతో మృతిచెందినట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించిన రైల్వేపోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అసెంబ్లీ ముట్టడికి యత్నించిన సర్పంచులు

అరెస్టు చేసిన పోలీసులు

నాంపల్లి: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన తెలంగాణ సర్పంచులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వీ యాదయ్య గౌడ్ నేతృత్వంలో సర్పంచులు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. డీజీపీ ఆఫీసు నుంచి రవీంద్ర భారతి సిగ్నల్ మీదుగా వస్తున్న సర్పంచులను పోలీసులు అడ్డుకున్నారు. వారిని అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా అక్కడ కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు ఆందోళన కొనసాగిస్తామని సుర్వీ యాదయ్య గౌడ్ పేర్కొన్నారు.

ఆరు ఎకరాల భూమికి పట్టా

- తెలియకుండా ఇతరుల పేరిట ఎలా చేస్తారని యజమానుల ఆందోళన
- తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు



కందుకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టాదారుల ఆందోళన

కందుకూరు: తాము కొనుగోలు చేసి ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూమిని తమకు తెలియకుండానే ధరణిలో ఇతర వ్యక్తులకు పట్టా చేయడాన్ని ప్రశ్నిస్తూ అసలు పట్టాదారులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పెట్రోలు పోసుకునేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. బాధితులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని లేమూరు రెవెన్యూ సర్వే నంబర్ 246లో 19.10 ఎకరాల భూమిని 1985లో అగర్‌మియాగూడ, లేమూరు గ్రామాలకు చెందిన అందె మైసయ్య, కడారి అంజయ్య, కడారి లక్ష్మయ్య, కడారి యాదయ్య, అందె మల్లయ్య, అందె జంగయ్య కుటుంబ సభ్యులు ఉస్మాన్‌మొయినుద్దీన్ నుంచి కొనుగోలు చేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది నాటి నుంచి వారే సాగు చేసుకుంటున్నారు. కాగా ఆ భూమిపై పీటీదారులమంటూ కొందరు రెండేళ్ల క్రితం అప్పటి ఇన్‌చార్జి ఆర్డీఓ వెంకటాచారి హయాంలో 38–ఈ సర్టిఫికెట్ పొందారు. ఇదే విషయమై ప్రస్తుత అదనపు కలెక్టర్ వద్ద కేసు పెండింగ్‌లో ఉంది. కాగా ఆ సర్టిఫికెట్ పొందిన చిన్నగల్ల బాల్‌రాజ్, చెన్నమ్మ, యాదయ్య ఇటీవల ధరణిలో ఆరు ఎకరాల భూమిని తమ పేరిట పట్టా చేసుకున్నారు. విషయం తెలుసుకున్న అసలు పట్టాదారులు, వారి కుటుంబీకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారులను నిలదీశారు. అనంతరం ధర్నా చేసి ఆర్డీఓను కలిసి సమస్య వివరించారు. దొంగ సర్టిఫికెట్ సృష్టించుకుని తమ భూమిని చట్టానికి వ్యతిరేకంగా పట్టా చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి వెంటనే రిజిస్ట్రేషన్ అయిన భూమిని బ్లాక్ లిస్టులో పెడుతున్నట్లు వారికి చెప్పారు. అయినా వారు తమ పేర్లతో యథావిధిగా ధరణిలో నమోదు చేసే వరకు ఇక్కడే ఉంటామని భీష్మించారు. కాగా ఈ విషయమై ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డిని వివరణ కోరగా.. కేసు కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండగా పొరపాటున ధరణిలో ఆ భూమిని 38ఈ సర్టిఫికెట్ ఆధారంగా డిజిటల్ సిగ్నేచర్ చేశారని, ఆ సమస్యను పరిష్కరించడంతో పాటు సంబంధీకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

గాయపడిన పాల వ్యాపారి

మొయినాబాద్: అతివేగంతో వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి లోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన పా న్న వెంకటేశ్ పాల వ్యాపారి. సోమవారం ఆయ న తన బైక్‌పై పాలు విక్రయించేందుకు నగరానికి వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటికి వస్తుండగా అజీజ్‌నగర్ చౌరస్తా వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రు డిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి


రిలే దీక్షలో డీఎస్పీ నాయకులు

డీఎస్పీ రాష్ట్ర నాయకుడు రాఘవేందర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాఘవేందర్ డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి వర్గాలకు విద్య, వైద్యం, భూమి, ఇళ్ల సాధనకు డీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా చేపట్టిన రిలే దీక్షలు నాలుగవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా డీఎస్పీ రాష్ట్ర నాయకుడు రాఘవేందర్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు.. అర్హతల ఆధారంగా ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. సాగునీటిని అందించి రైతును రాజు చేయాలన్నారు. నిరుపేద వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, భూమి, ఇళ్లు ఇవ్వాలనే డిమాండ్‌తో రిలే దీక్షలు చేపట్టామన్నారు. అర్హులైన వారందరికీ 200 గజాల స్థలాన్ని, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా కన్వీనర్ రాకేశ్, కో కన్వీనర్ హైమద్ పాష, లాలయ్య, నర్సింలు, రాజు, జయప్రసాద్, ఫరూఖ్‌నగర్ మండల కన్వీనర్ చెన్నయ్య, కొందుర్గు మండల కన్వీనర్ రవీందర్, కేశంపేట మండల కన్వీనర్ మహిపాల్, నాయకులు శివ, మల్లేష్, శ్రీశైలం, శ్రీను, యాదయ్య, రఘు, యాదయ్య, రఘు, నర్సింలు, చిన్న రాములు, గోపాల్, శివ, రమేశ్, ఉదయ్, గణేశ్, నరేశ్, ధర్మ స్టూడెంట్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క దొంగ... తొమ్మిది వారెంట్లు!

- మూడున్నర ఏళ్లుగా పరారీలో ఉన్న ప్రదీప్
- రాజస్థాన్‌లో పట్టుకున్న సైబరాబాద్ సీసీఎస్

సాక్షి, సిటీబ్యూరో: సొత్తు సంబంధిత నేరాల్లో నిందితుడిగా ఉండి మూడున్నర ఏళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న రాజస్థాన్ వాసి ప్రదీప్‌ను సైబరాబాద్ సీసీఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఇతగాడిపై మూడు పోలీసుస్టేషన్ల పరిధిలో తొమ్మిది నాన్–బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూ) పెండింగ్‌లో ఉన్నట్లు క్రైమ్స్ డీసీపీ కె.నర్సింహ్మ సోమవారం తెలిపారు. రాజస్థాన్‌లోని బిచౌలా గ్రామానికి చెందిన ప్రదీప్ కొన్నేళ్ల క్రితం నగరానికి వలసవచ్చాడు. నిర్మాణరంగంలో కార్మికుడిగా పని చేసిన ఇతగాడు తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం దొంగగా మారాడు. కన్‌స్ట్రక్షన్ కంపెనీలు, నిర్మాణ స్థలాలను టార్గెట్‌గా చేసుకున్న ఇతగాడు వాటి నుంచి ఇనుము, అల్యూమినియం తదితర వస్తువులు చోరీ చేసి అమ్మేవాడు. ఈ ఆరోపణలకు సంబంధించి ఇతడిపై కొల్లూరు, మోకిలా, నార్సింగి పోలీసుస్టేషన్ల పరిధిలో తొమ్మిది కేసులు నమోదయ్యాయి. ఓ సందర్భంలో మారణాయుధాలతో బెదిరించి దోపిడీకి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2021లో ఇతగాడిని కొల్లూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై బయటకు వచ్చిన ప్రదీప్ తన స్వస్థలానికి వెళ్లిపోయారు. ఈ తొమ్మిది కేసుల్లోనూ కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో న్యాయస్థానాలు ఎన్‌బీడబ్ల్యూలు జారీ చేశాయి. మూడున్నరేళ్లుగా ఇతగాడి ఆచూకీ ఎవరికీ లభించలేదు. దీంతో ప్రదీప్ అరెస్టు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన సైబరాబాద్ సీసీఎస్ అధికాలు రాజస్థాన్‌కు పంపారు. ముమ్మరంగా గాలించిన పోలీసులు శనివారం రాజస్థాన్‌లో పట్టుకున్నారు. అక్కడి న్యాయస్థానంలో హాజరుపరిచిన అధికారులు పీటీ వారెంట్‌పై ఇక్కడకు తీసుకువచ్చారు. కొల్లూరు పోలీసులు కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఎనిమిది కేసుల్లోనూ ఇతడిని అరెస్టు చూపించనున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమానాస్పద స్థి తిలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిబట్ల ఠాణా పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. నాదర్‌గుల్ సమీపంలో చెట్టుకు మృతదేహం వేలాడుతోందని మధ్యాహ్నం 1:40గంటలకు డయల్ 100కు సమాచారం అందింది. ఈ మేరకు స్థానిక పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. ఓ టేకు చెట్టుకు వేలాడుతున్న 40–42 ఏళ్ల మధ్య ఉన్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి శరీరంపై నలుపురంగు చెక్స్ ప్యాంట్ ఉంది. ఆయన వేసుకుని చొక్కాతోనే ఉరేసుకున్నట్లు గుర్తించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. శరీరంపై గాయాలు గుర్తించిన పోలీసులు హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరి అరెస్టు


నిందితులు హరీశ్‌గౌడ్, రాంప్రసాద్‌రావు

మణికొండ: ఓ ఫంక్షన్ హాల్‌ను తమ అనుచరులతో కలిసి కూల్చివేయటం, అద్దెకు ఉంటున్న వారితో పాటు వాచ్‌మెన్‌ను బెదిరించి దోపిడీ యత్నం చేసిన ఇద్దరిని నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సమాచారం మేరకు... హైదర్‌షాకోట్‌లోని సాయిరాంనగర్ కాలనీలో ఉన్న ఏపీడీ ఫంక్షన్‌హాల్ స్థలాన్ని అహల్యాసింగ్ లీజుకు తీసుకున్నారు. ఆదివారం దాన్ని ఖాళీ చేయాలని గంధంగూడకు చెందిన హరీశ్‌గౌడ్, సాయిరాం కాలనీకి చెందిన రాంప్రసాద్‌రావులు వారిపై దౌర్జన్యం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. నిందితులతో పాటు వారి అనుచరులు కొంత మంది ఉన్నారని వారిని గుర్తించి అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. చట్ట విరుద్ధంగా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని, బాధితులు తమను సంప్రదించాలన్నారు

బంగారు గొలుసు చోరీ చేసిన డ్రైవర్‌కు రిమాండ్


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కాంతారెడ్డి

షాబాద్: మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటనలో ఓ ప్రైవేట్ పాఠశాల బస్ డ్రైవర్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. కొందుర్గు మండల పరిధిలోని చిన్న ఎల్కిచర్ల గ్రామానికి చెందిన కావలి లక్ష్మి ఈ నెల 4న మండల పరిధిలోని ముద్దెంగూడకు చెందిన బంధువు వద్దకు వెళ్లేందుకు గ్రామంలోని బస్టాండ్ వద్ద వేచియుంది. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న ఎలికట్ట గ్రామానికి చెందిన జక్కని శివలింగం తాను అటే వెళ్తున్నాని ఆమెను బైక్‌పై ఎక్కించుకున్నాడు. షాబాద్ సమీపంలోని ఆన్‌మోల్ గార్డెన్ వద్దకు రాగానే ఆమె మెడలోంచి బంగారు గొలుసు చోరీ చేసి పారిపోయాడు. దీంతో బాధితురాలు షాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆదివారం సర్దార్‌నగర్‌లో ఓ టీ స్టాల్‌వద్ద చాయ్ తాగుతుండగా నిందితుడిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఆయన్ను విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించడంతో నిందితుడి వద్ద నుంచి తులం బంగారు గొలుసు, సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. శివలింగంపై షాద్‌నగర్ ఠాణాలోనూ పలు కేసులున్నట్లు గుర్తించిన పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలు వెల్లడించిన వారిలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌నాయుడు, ఎస్ఐ సతీశ్‌కుమార్ తదితరులున్నారు.

నాంపల్లిలో ఢిల్లీ స్పెషల్ సెల్ ఆపరేషన్

హ్యూమన్ ట్రాఫికర్ కర్మాన్ హైదర్ కోసం గాలింపు	వారం రోజులు మాటు వేసిన ప్రత్యేక బృందం	దాదాపు 2500 కిమీ 'ఛేజ్' చేస్తూ వచ్చిన అధికారులు	ఎట్టకేలకు ఆదివారం పట్టివేత, విమానంలో తరలింపు	నిందితుడిపై రూ.2 లక్షల రివార్డు ప్రకటించిన ఎన్ఐఏ


నిందితుడు కర్మాన్ హైదర్

సాక్షి, సిటీబ్యూరో: ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన స్పెషల్ సెల్ అధికారులు నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో భారీ ఆపరేషన్ చేపట్టారు. దాదాపు వారం రోజులు మాటు వేసి, గుట్టుగా జరిగిన దీని ఫలితంగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సహా వివిధ రాష్ట్ర పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న కర్మాన్ హైదర్ చిక్కాడు. మారు పేరుతో ఓ లాడ్జిలో తలదాచుకున్న ఇతగాడిని పట్టుకున్న స్పెషల్ సెల్... ఆదివారం విమానంలో ఢిల్లీకి తరలించారు. ఓ కన్సల్టెన్సీ ముసుగులో విదేశీ ఉద్యోగాల పేరుతో వివిధ ప్రాంతాలకు చెందిన యువతను ఆకర్షించడం, థాయ్‌లాండ్, లావోస్‌కు తరలించి అక్కడి సైబర్ క్రైమ్ ముఠాలకు అప్పగించడం, ఆ కాల్ సెంటర్ల ద్వారా విదేశీయులను బెదిరించిన దండుకోవడంలో హైదర్ గ్యాంగ్ కీలకమని ఎన్ఐఏ గుర్తించింది.

చైనీయుల పరిచయంతో మారిన కథ...

ఢిల్లీలోని జసోలా ప్రాంతానికి చెందిన హైదర్ అక్కడే అలీ ఇంటర్నేషనల్ కన్సల్టెన్సీ సర్వీసెస్ పేరుతో ఓ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా దీన్ని ఏర్పాటు చేసినప్పటికీ... తొలినాళ్లల్లో కేవలం జాబ్, స్టడీ, విజిట్ వీసాల ప్రాసెసింగ్ మాత్రమే చేసేవాడు. అయితే సోషల్‌మీడియా ద్వారా కొందరు చైనీయులతో ఏర్పడిన పరిచయాలు హైదర్ పంథాను మార్చేశాయి. కమీషన్లకు ఆశపడిన ఇతగాడు తన కన్సల్టెన్సీ ద్వారా సైబర్ నేరాలు చేసే చైనీయులకు సహకరించడానికి అంగీకరించాడు. మనోజ్, సాహిల్, ఆశిష్, పవన్ యాదవ్‌లతో ముఠా కట్టి చైనీయుల ఆదేశాల మేరకు పని చేయడం మొదలెట్టాడు. దేశంలోని అనేక మెట్రో నగరాల్లో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్న హైదర్ నేతృత్వంలోని గ్యాంగ్ విదేశాల్లో ఉద్యోగాల పేరుతో యువతను ఆకర్షించడం ప్రారంభించింది.

ఆ రెండు దేశాలకు అక్రమ రవాణా చేసి...

చైనీయుల నేతృత్వంలో పని చేసే సైబర్ ముఠాలకు థాయ్‌లాండ్, లావోస్ అడ్డాలుగా మారిపోయాయి. తాము తెర వెనుక ఉండి, ఆయా దేశాలకు చెందిన వారినే ముందు పెట్టి కథ నడిపిస్తున్నారు. ఇక్కడ నుంచి ఉద్యోగాల పేరుతో అక్రమ రవాణా చేసి తీసుకువెళ్లిన యువకుల్ని ఆ రెండు దేశాల్లో కాల్ సెంటర్లు నడిపే ముఠాలకు అప్పగిస్తున్నారు. అక్కడి కాల్ సెంటర్ల నిర్వాహకులు వీరికి బస ఏర్పాటు చేయడంతో పాటు పాస్‌పోర్టులు, ఇతర పత్రాలు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. యువకుల్ని బానిసలుగా మార్చుకుని, వారికి ఇష్టం ఉన్నా, లేకపోయినా సైబర్ నేరాలకు సంబంధించిన కాల్ సెంటర్లలో టెలీ కాలర్లుగా పని చేయిస్తున్నారు. ఈ మోసాలు చేయడం ఇష్టం లేక ఎవరైనా తిరిగి రావాలని భావించినా... పాస్‌పోర్టు, వీసా, ఇతర పత్రాలు తమ వద్ద లేకపోవడంతో అది సాధ్యమయ్యేది కాదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే పని చేస్తున్నారు.

న్యూ ఫ్రెండ్స్ కాలనీ యువకుడి ఫిర్యాదుతో...

ఆ రెండు దేశాల్లో ఉన్న కాల్ సెంటర్ల ద్వారా టెలీ కాలర్లుగా మారిన యువకులు అమెరికా, యూరప్ దేశాలకు చెందిన వారిని టార్గెట్ చేస్తున్నారు. అక్రమ లావాదేవీలు, కేసులు సహా వివిధ రకాలుగా భయపెట్టి తాము డిమాండ్ చేసిన మొత్తం క్రిప్టో కరెన్సీ ద్వారా చెల్లించేలా చేస్తున్నారు. ఈ మొత్తం మాత్రం చైనీయులు ఏర్పాటు చేసిన నెట్‌వర్క్‌కు చేరేలా ఏర్పాట్లు జరిగాయి. ఏళ్లుగా ఈ దందా చేస్తున్న హైదర్ వ్యవహారం ఈ ఏడాది మేలో వెలుగులోకి వచ్చింది. ఇతడి కన్సల్టెన్సీ ద్వారా లావోస్‌లో ఉద్యోగం కోసం ఢిల్లీలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీకి చెందిన ఓ యువకుడు వెళ్లాడు. అక్కడ పరిస్థితులు చూసి చాకచక్యంగా తప్పించుకుని వచ్చాడు. ఆపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. హైదర్ గ్యాంగ్‌లో మిగిలిన వారిని పట్టుకున్న పోలీసులు భారీ నెట్‌వర్క్ ఉందని గుర్తించారు. దీంతో ఈ కేసు ఎన్ఐఏకు బదిలీ కాగా... హైదర్‌పై అధికారులు రూ.2 లక్షల రివార్డు ప్రకటించారు.

ఏడు నెలలు... 2,500 కిలోమీటర్లు ఛేజింగ్

హైదర్‌ను పట్టుకోవడానికి ఢిల్లీ స్పెషల్ సెల్ ఏసీపీ వేద్ ప్రకాష్ నేతృత్వంలో ప్రత్యేక బృందం ఏర్పాటైంది. ఈ అధికారులు మే నుంచి హైదర్ కదలికలపై నిఘా ఉంచి గాలింపు చేపట్టారు. పోలీసుల నిఘాను తప్పించుకునేందుకు ఇతగాడు తరచు తన మకాం మారుస్తూ వచ్చాడు. ప్రతి ఆదివారం ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లిపోయేవాడు. ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్‌ల్లో వివిధ నగరాల్లో తిరిగిన ఇతడు నాంపల్లి చేరుకున్నాడు. ఇలా దాదాపు 2500 కిమీ అతడు ప్రయాణించగా... స్పెషల్ సెల్ వెంటాడుతూనే వచ్చింది. ప్రతి సందర్భంలోనూ కాస్తలో పోలీసుల నుంచి తప్పించుకున్నాడు. హైదర్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ సాధారణ లాడ్జిలో బస చేశాడు. ఖర్చులకు అవసరమైన డబ్బు కోసం తన ఏటీఎం కార్డు ద్వారా రూ.25 వేలు డ్రా చేశాడు. ఈ లావాదేవీ ఆధారంగా హైదర్ హైదరాబాద్‌లో ఉన్నట్లు ఢిల్లీ స్పెషల్ సెల్ గుర్తించింది. దీంతో గత సోమవారం ఇక్కడకు వచ్చిన ఆ పోలీసులు బృందం రహస్యంగా గాలించిన అధికారులు ఆదివారం పట్టుకున్నారు. నాంపల్లి నుంచి కేరళ వెళ్లే ప్రయత్నాల్లో చిక్కిన హైదర్‌ను పోలీసులు విమానంలో ఢిల్లీ తరలించారు.